# అర్జి


చెన్నమనేని
వినోదాదేవి

జైల్లోకి సూర్యుడు తొంగి చూశాడు. అందులోకి ఎవరయినా అనుమతిలేనిది రావడానికి పోవడానికి వీలు లేదు. కాని సూర్యునికి ఈ ఆంక్షలు ఏవీ లేవు.

లేత కిరణాల వేడికి చలికాలపు మంచు కదలడంలేదు. సర్కస్‌లోని జంతువులను కొంత సమయం కొరకు వదలినట్టుగా ఖైదీలను తమతమ బారక్‌ల నుండి వదులుతూ వారి లెక్క చూసుకుంటున్నారు జమేదార్లు. కొద్దిసేపట్లోనే జైలు ఆవరణలలో వందల ఖైదీల సంచలనం ప్రారంభమయింది. నిర్ణయింపబడిన ప్రకారం జట్లు జట్లుగా పనిలోకి బయలుదేరుతున్నారు. వారు తిరిగే ప్రాంతం చుట్టూ పెద్ద గోడ వుంది.

ఎండ వచ్చింది. కిరణాల వేడికి మంచు చెదరిపోయింది. బారక్‌లో ఇంకా చలిగా వుంది. కాఫీ తాగి రామారావు బారక్ బయటికి వచ్చాడు. ఆవరణలో జైలు గోడ దగ్గర కుర్చీ వేసుకొని ఎండ వెడిమిలో ఒక పుస్తకాన్ని తెరిచి చదవడం ప్రారంభించాడు. రామారావు కూడా ఖైదీలాంటి వాడే!....

వెనుకగా నిలబడ్డ ఆ ఇద్దరు ఖైదీలు రామారావు ముందుకు వచ్చి నిలబడ్డారు. ఒకడు పొట్టిగా దిట్టంగా వున్నాడు. జైలును తను కోరుకొని వచ్చినవాడిలా ఉత్సాహంగా కనబడుతున్నాడు. రెండవతను పొడుగ్గా మధ్యరకంగా వున్నాడు. పొడుగు మీసాలు వున్నాయి. అతను మాత్రం




*ఎవరి భార్యాబిడ్డలను వాళ్ళు ప్రేమించడం సహజమైందే, మానవతను ప్రకటించేదే! అయితే, అది మరీ పరిమితమై స్వార్థం స్థాయిలోకి దిగితే. మనిషికీ మనిషికీ మధ్య వుండవలసిన సంబంధాన్ని చంపేస్తుంది. విషానికి విరుగుడు విషమే అన్నట్టు, సగం స్వార్థానికి పూర్తి స్వార్థం యెదురయినప్పుడే ఆ సంగతి అర్థమయ్యేది!*



ఆంధ్రప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి శ్రీ యడ్లపాటి వెంకట్రావును. ఇటీవల మద్రాసులో "పల్లెరకొట్టు చిట్టెమ్మ" చిత్ర నిర్మాత ఆర్. ఎస్. రాజు సన్మానించినప్పటి దృశ్యం.

కొంచెం భయంతో ఆతురతతో వున్నట్టు కనిపిస్తున్నాడు.

"అయ్యా!.... మీ పేరు ఖైదీలల్ల బాగ పాకిపోయింది"... అన్నాడు రెండవవాడు.

ఏదో పనిమీద వచ్చారన్న ఉద్దేశ్యంతో "ఎవరు మీరు?" అని రామారావు అనడంతోనే వారిద్దరు వచ్చి రామారావు ముందు కూర్చున్నారు. వాళ్ళ చేతుల్లో కాగితాలు చూస్తేనే విషయం అర్థమయింది రామారావుకు.

"జర కేసు రాయించుకుంటమని అచ్చినం దొర"... అన్నాడు పొట్టిగా వున్నవాడు. రెండవవాడుమాత్రం మాట్లాడకుండా చేతులు జోడించుకొని కూర్చున్నాడు.

రామారావు వచ్చినప్పటినుంచి తను వకీలు అని తెలిసిన తరువాత కొందరు ఖైదీలు రావడం తనతో జైలు అప్పీళ్లు రాయించుకోవడం జరుగుతున్నది. అప్పీళ్ళలో కొన్ని శిక్షలు తక్కువ వేయమని.... కొన్ని నేరం చెయలేదని....కొన్ని దయ చూపి వదలమని.... ఈ విధంగా రాయించుకొని వాటిని హైకోర్టు న్యాయమూర్తులకు జైలు ద్వారా పంపడం జరిగింది. తను రాసిన రాతలో న్యాయానికి ఎలాంటి నైపుణ్యం చూపలేదు. ఏదో రాసి పడేశాడు. కాని అనుకోకుండా వీటి వల్ల ఎంతో మందికి శిక్షలు తగ్గడం, కొందరు విడుదల కావడంకూడా జరిగింది. రామారావుకు ఎలాంటి ఉపయోగం జరుగకపోయినా అనుకోని గౌరవం మాత్రం లభించింది. ఈ విషయం జైలు అధికార్లకు మాత్రం తెలియకూడనిది కాబట్టి, ఈ గౌరవ మర్యాదలు తనకూ.... మిగతా ఖైదీల మధ్యన నిలిచిపోయినయి.

"ఏ కేసులో వచ్చారు...." అని రామారావు పుస్తకాన్ని మూశాడు.

అవకాశం దొరికిందికదా అని పొట్టిగా లావుగావున్న అతడు తన చేతిలోని కాగితాలను రామారావు చేతిలో వుంచాడు.

"అయ్యా!.... ఈడు పెండ్లాం ముక్కు చెవులు కోసిండు.... రెండేండ్లు వడ్డది" అని రెండవవాడు గట్టి కేసే అన్నట్టుగా మొఖం పెట్టి అన్నాడు. అందులో తనది చిన్న కేసేనన్న భావం కూడా వ్యక్తమయింది.

"అయ్యా ఎట్లనన్నా రాసి మమ్ముల ఇడుదల జేయించుండ్రి దొర!....మీ కాల్లు మొక్కుతం" అన్నాడు మళ్ళీ రెండవవాడు.

"అరే!....మనమందరం జైల్లో వున్నవాళ్ళమే.... నన్ను ఈ విధంగా బ్రతిమిలాడటం మంచిది కాదు" తన కిస్తున్న గౌరవాన్ని భరించలేక అన్నాడు రామారావు.

"అట్లెందుకు దొర! మీరు బయట ఉన్నా దొరలే! లోపటికి వచ్చినా దొరలే!" అన్నాడు రెండవ వాడు.

"దొరలు దొరలేనే....!" అన్నాడు పొట్టిగా లావుగా వున్నవాడు రెండవవానితో.

ఈ మాటలను చూస్తే సాధ్యమయినంత తొందరలో రెండు కేసులు రాయించుకొని పోతారని రామారావుకు అర్థమయింది.

చేతిలోవున్న కాగితాలను తిరగవేశాడు రామారావు. కొద్ది నిముషాలు గడిచినయి. తను ఇంటివద్ద వున్నప్పుడు ఇటువంటివి రాయాల్సి వచ్చినప్పుడు. తన భార్య తన కొరకు స్ట్రాంగ్ టీ ఇచ్చి సహకరించేది. తను జూనియర్ కాబట్టి అతి జాగ్రత్తగా రాసేవాడు. తన అజాగ్రత్తవల్లకాని, తక్కువ అనుభవంవల్లకాని తనను నమ్ముకున్న క్లయింటుకు అన్యాయం జరుగకుండా ఉండడానికి సీనియర్ లాయర్లతో సంప్రదించందే దాన్ని పూర్తిచేసేవాడుకాదు. కొత్తకేసు వచ్చిందంటే దాని డ్రాఫ్టింగు.... మిగతా తతంగం అంతా....అది రామారావు కొరకు పెద్ద కార్యక్రమం అని... అది ముందు ఉంచుకుంటే ఇంకెవ్వరు జ్ఞాపకం రారని తన భార్య అంటూ వుండేది. డిస్టర్బ్ చేసే ప్రయత్నం చేసేది. ఇవి మనసులో మెదలగానే రామారావు ఊహలు కొంతసేపు జైలు బయటకు నడచాయి. తనకొరకు ప్రతిక్షణం ఎదురుచూసే భార్యను తలుచుకుంటే గుండె అదిరింది. బెదురుతున్న తన భార్య చూపులు "...జీవితంలో తిరిగి ఇద్దరం కలిసి నిలబడతామా....?" అన్న ఆమె మాటలు అతని కంటిలో నీరయి తిరిగాయి..

"ఈ వెధవ కట్టుకున్న భార్య ముక్కు చెవులు ఎలా కోశాడు! ఇంకా క్షమాభిక్ష కావాలట!" రామారావు లోపల విసుక్కున్నాడు.

లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసినందుకు శిక్ష ఏమో!....అతనికి తెలియదు కాని ఈ కేసులో న్యాయమూర్తి రెండు సంవత్సరాలు శిక్ష వేయడం తక్కువే అనుకున్నాడు రామారావు.

"నేను నీకేసు రాయను ...." అంటూ కాగితాలు పొట్టిగా లావుగా వున్నతనికి ఇచ్చి తానూ ఒక తీర్పు ఇచ్చినవాడిలా ఫీల

య్యాడు. రామారావు మొఖం చూస్తే వాడు ఏమీ మాట్లాడలేకపోయాడు. తన అప్పీలు రాయనందుకు కాదు కాని, కనసం నిజంగా నేరం చేశావా? ....అని అడగనందుకు .... అతను ఆశ వదులుకొని కాగితాలు తీసుకొని వెళ్ళిపోయాడు.

మిగిలినవాడూ తనకాగితాలను భయంతో ఇవ్వబోయాడు.

"నీ సంగతేమిటి?.... భార్య పీక కోశావా?.... తల పగులకొట్టావా?...." అంటూ కాగితాలను లాక్కున్నాడు రామారావు.

"కొత్తగా వచ్చినట్టున్నావు" రామారావు అడిగాడు.

"అవునయ్యా!.... నేను.... ఎన్నిట్లనో తప్పించుకున్న! పొడిశిన కేసులల్ల బయట పడ్డగని ఇండ్ల యిరికిన దొరా! పిల్లలు గల్లోన్ని పెడ్లాం పశిద్దయి ఉన్నది శానకట్టం. ఐతంది దొర! సేన్ బోకపోతె తల్లితోని ఆరుగురు ఉపాసంతోని సత్తరు. ఎట్లన్న జేసి....గడ్డకేయి...." అంటూ చేతులతో మొఖాన్ని దాచుకున్నాడు.

రామారావు అతని కాగితాలన్నీ చదివాడు. అతనిపై ఉన్న ఆరోపణ మాత్రం అసహజంగా ఉన్నది. కత్తి చూపించి చంపుతానని బెదిరించి ఒక యువకుని దగ్గర రెండు వందల రూపాయలు తీసుకున్న నేరానికి తన ఒప్పుగోలుమీదనే రెండు సంవత్సరాలు శిక్ష వేయబడ్డట్టుగా అందులో వుంది.

"నిజంగా నేరం చేశావా?" రామారావు అడిగాడు.

"అపద్దమెందుకు దొర. చేశిన. కాని ఎన్మిది నూర్లు.... ఆందగ్గరికేలి గుంజుకున్న. ఓ బీడీల కట్ట కొనంగ పోలీసోల్లకు దొరికిన, కాని ఇండ్ల దొంగతనంల దొంగతనం జరిగింది దొర!.... నాదగ్గరికేలి పోలీసోల్లు ఎనిమిది నూర్లు గుంజుకున్నరు. ఆల్లు తంతె ఉన్నదున్నట్టు చెప్పిన. ఆడూ....ఆడూ...."

"వాడంటె ఎవరు" విసుగ్గా అడిగాడు రామారావు.

"నేనెవ్వల్దగ్గర్కెలయితే రూపాల్ గుంజుకున్ననో ఆడు పోలీసు టేషన్ల.... ఏం జెప్పిండంటె పెండ్లి బట్టలకని రూపాల్ దెచ్చుకుంటె నేను కత్తిసూపి సంపుతనని గుంజుకున్ననని సెప్పిండు. పోలీసోల్లు నేను ఇన్నూరు రూపాయల్ గుంజుకున్నని కొట్టుల శెప్పమంటె శెప్పిన....కొట్టుల.... రెండేండ్లు శిచ్చ అన్నడు. మరి మిగిల్న ఆర్నూర్లు ఏమయినయిదొర! ఇండ్ల ఎవన్న పాంట్ వుంటె సూశి రాయిండ్రి...."


## ఈ సంవత్సరపు బంపర్ ఆఫర్

జూన్ 1978 బహుమతులు గెలుపొందినవారు సత్యనారాయణ్ చౌహాన్ అనూపషహర్ (రాజ్) మరియు మహమ్మద్ జహీద్ బిలాస్పూర్

బహుమతులు : వాచ్, కెమెరా, టేపరికార్డర్, రికార్డుప్లేయర్, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ (ఏదైనా ఒక బహుమతి మా అభీష్టంపై) ఎంట్రి ఫీజు లేదు. కన్సొలేషన్ లేక మూడవ బహుమతి : ఆర్టు సిల్కు ప్రింటెడ్ చీర 60 రూపాయలకు. ఇది అమ్మకం అభివృద్ధి పథకం.

| | | |
|---|---|---|
| 9 | 14 | 7 |
| 8 | 10 | 12 |
| 13 | 6 | 11 |

పహాయమునకు 30

నిబంధనలు : తెల్లకాగితంపై 7 నుండి 15 వరకు అంకెలని ఒకసారి మాత్రమే వాడి ఎటుకూడినా మొత్తం 33 వచ్చునట్లుగా వేయవలయును. 2. బహుమతి గెలిచినవారికి పోస్టేజి, ప్యాకింగ్ ఫీజు చెల్లించుటకు తెలియపర్చబడును. వివాదములు ఆలీఘర్ జ్యూరిస్ డిక్షన్‌లోనే. ఎంట్రీలు హిందీ, ఇంగ్లీషులో మాత్రమే పంపాలి.

ఆఖరి పోస్టింగ్ తేది : 23-8-78

ATLAS TEXTILES (AJWV-33) P. B. No. 95, Aligarh-202001.



## సువర్ణావకాశం రు. 1,000·00

ఎంట్రీ ఫీజు లేదు మరియు ఇతర ఆకర్షణీయమైన బహుమతులు

1వ బహుమతి



రు. 1000 నగదు

2వ బహుమతి



ఆల్ వరల్డ్ 4 బ్యాండ్ ట్రాన్సిస్టర్

3వ బహుమతి



ఆల్ ఇండియా ట్రాన్సిస్టర్ రు. 185

1వ డ్రా 30-7-78
2వ డ్రా 10-8-78

సరిపడే మాటలతో ఖాళీలను పూరించండి.

1. అమెరికాను కనిపెట్టినది..............................
కొలంబస్/వాస్కోడిగామా/జేమ్సుముఖ్యా

2. ఇండియా ఆఖరి గవర్నర్ జనరల్ ఎవరు..............
శ్రీ రాజగోపాలాచార్య/లార్డ్ మౌంట్ బాటన్

3. ఇండియా ఆఖరి మొగల్ రాజు ఎవరు..............
ఔరంగజేబ్/బహదూర్ షా జఫార్ రంగిలా

4. ఇండియా మొదటి డిప్యూటీ ప్రైమ్‌మినిస్టర్ ఎవరు....
..............................................................
సర్దార్ వల్లభాయ్ పటేల్/గుల్జారీలాల్ నందా/ జె. ఎల్. నెహ్రూ

జవాబు కొరకు హిందీ లేదా ఇంగ్లీషులో వ్రాసిన స్వంత చిరునామాగల కవరు పదిహేను (15) రోజులలోగా పంపండి.

నిబంధనలు : 1. ఒక కుటుంబంనుంచి ఒక ఎంట్రీ మాత్రమే అంగీకరించబడును. 2. బహుమతులు సగం ధరపై ఇవ్వబడును. 3. మా సభ్యులలో అభివృద్ధి కోసం ఈ ప్రకటన ఉద్దేశించబడినది. 4. ప్రమోటర్ల తీర్మానం ఖాయమైనది మరియు చట్టబద్ధమైనది. 5. వివాదములు ఢిల్లీ కోర్టులో పరిష్కరించుకోవాలి. 6. గెలుపొందినవారు బహుమతులకు సంబంధించి పోస్టేజి, ప్యాకింగ్ మరియు లైసెన్సు ఫీజు చెల్లించాలి.

మీ ఎంట్రీలు దిగువ చిరునామాకు పంపండి :-

OXFORD INDIA (A-1)
Gandhi Nagar. Delhi-110 031.

అంటూ అమాయకంగా రామారావు కుర్చీ దగ్గరికి జరుగుతూ అడిగాడు.

తనలాంటివారి తప్ప ఇతర తరహా దొంగతనాలు చేసే ఘరానా మనుషులు వుంటారని పాపం వీడికి తెలియదు అనుకున్నాడు రామారావు. ఎందుకో వాణ్ణి చూస్తే జాలివేసింది. వాడు దొంగ అని తెలుసు. అదేకాకుండా ఇంతవరకు ఎంతో మందిని పొడిచికూడా తప్పుకున్నాడు. తప్పకుండా శిక్షార్హుడే!....

"నేను లేకపోతే .... నా పెండ్లాం, పోరగాండ్లకు బుక్కెడుపెట్టేటోడు ఎవ్వడ్లేడూ. అల్లకోసం నేను ఏదంటే అది జేత్తదొర! నేన్లేకపోతే అల్లు బత్కరు. ఎట్లనన్నజేసి గడ్డకెయ్యండ్రి." అంటూ రెండు చేతులు రామారావు కాళ్లదగ్గరకు తేబోయాడు.

అతని మాటలు బాగనిపించినాయి. అతనికి పెండ్లాం పిల్లలపై వున్న మమకారం రామారావును కదలించివేసింది. వకీలు బుద్ధి ఎటుపోతుంది? కాగితాలను తను చదువుతున్న పుస్తకంపై ఉంచి అప్పీలు రాయడం మొదలుపెట్టాడు. అతను నేరం చేయలేదని, పోలీసువారు పెట్టిన కేసు తప్పని, వీణ్ని జైల్లో త్రోయడానికి, వీని ఒప్పుకోలు ఎనుక పోలీసువారి ఇనుప హస్తం వుందని, నేర ఆరోపణ అంతా వేదికమీద నడిపిన నాటకమని కోర్టువారుసరి అయిన అవకాశమివ్వలేదని, ఇంకా ఎన్నో రాసి, చివరికి క్షమించి వదలగాని ఎప్పుడు వుపయోగించే చిలకపలుకులతో నింపి క్రింది కోర్టువారి తీర్పును ప్రక్కకునెట్టి ఇతన్ని విడుదల చేయవలసిందిగా కోరుతూ రాశాడు. తాను రాసిన రెండు కాగితాలమీద అతని సంతకం పెట్టమని తన పుస్తకాన్ని కాగితాలను అందించి "నీవు జైలు అధికారికి ఈ రెండు కాగితాలిస్తే ఒకటి వారుంచుకొని ఇంకొకటి పైకోర్టు వారికి పంపుతారు" అంటూ రామారావు కుర్చీలో ఒరిగి చేతులు విరుచుకున్నాడు.

సంతకం వరకే నేర్చుకున్న తన రాతను చాలాసేపు రెండు కాగితాల మీద రాసి కాగితాలను తీసుకొని పుస్తకాన్ని తిరిగిస్తూ "అయ్యా!.... ఇది లావు దొడ్డుగున్నది, ఏం కితాబో!...." అని సనుగుతున్నట్టుగా అన్నాడతను లేస్తూ ...

"ఇది గీతా రహస్యం....... దేవుని పుస్తకం...." అని వెంటనే అన్నాడు రామారావు నవ్వుకుంటూ.

"అయితే పనయితది దొర!".... అని ఉత్సాహంగా అంటూ "ఇందుల ఏం ఉన్నద్దొర!...." అని ప్రశ్నించాడు.

రామారావు మనస్సులో విసుక్కున్నాడు. తాహతుకు మించిన విషయాన్ని చొరవ తీసుకొని అడుగుతున్నందుకు కోపమే వచ్చింది. పుస్తకాన్ని తీసుకొని లోపలికి నడుస్తూ "ఇందులో దేవుడు ప్రతిఫలం ఆశించకుండా పని జేయమన్నాడు అంటే .... నాకేం వస్తుంది .... అని .... చూసుకోకుండా పని చేస్తూపోవడం...." అని అనుకోకుండానే చెప్పాడు.

"మీరు అదే జేత్తుండ్రు దొర!" అంటూ రామారావు కుర్చీని మడతపెట్టి లోపలికి తీసుకుపోయాడు అతను.

* * *

సాయంత్రం కొంచెం చీకటి పడుతున్నది. సూర్యాస్తమయం జైలునుంచి కనబడదు. గోడలు అడ్డంగా వుంటాయి. రామారావు పుస్తకం మూసేసి కూర్చున్నాడు. ఉదయం తన దగ్గర అప్పీలు రాయించుకున్నతను చెట్లకు నీళ్లు పోస్తున్నాడు. కొంచెం ఉత్సాహంగా కనబడుతున్నాడు విడుదల అవుతానేమో అనే ఆశ అతనిలో వుదయించినట్టుంది.

"ఎయ్ ఇట్రా!...." అతన్ని పిలిచాడు రామారావు.

పిలవడంతోనే దగ్గరికి వచ్చి కూర్చున్నాడు అతను.

"నువ్వు బయటికి పోయిన తరువాత మళ్ళీ ఇదేపని చేస్తావా, నీతిగా బ్రతుకుతావా?" సర్వోదయ నాయకునిలా అడిగాడు రామారావు.

అతను మౌనంగా నేలను చూస్తూ కూర్చున్నాడు. "నేనొకటి చెప్తాను విను." అని రామారావు నవ్వుతూ మొదలు పెట్టాడు.

"నీవు విడుదల అయిన తరువాత కొన్ని రోజులకు నీ అవసరానికో, బుద్ధి గడ్డి తినో.... దొంగతనానికి బయల్దేరుతావనుకో!.... వింటున్నావా?...." రామారావు అడిగాడు.

"అయ్యా!...." అంటూ తలూపాడు అతను. తిరిగి రామారావు మొదలు పెట్టాడు.

"ఆనాడు రైలు సిగ్నలు కొరకు స్టేషన్ అవతల ఆగడాని కొరకు మెల్లగా నడుస్తున్నప్పుడు .... ఒక రెండవ తరగతి డబ్బాలో ఎక్కుతావనుకో అందులో ఇద్దరు భార్యాభర్తలు వారి ఇద్దరు పిల్లలు తప్ప ఇంకెవరుండరు .... ఆ!.... ఆడమనిషి ఒంటిమీద బంగారపు నగలు. అతని దగ్గర రూపాయలు ఉంటాయనుకో నీవేం చెస్తావ్ ?...." అంటూ ఆపాడు.

"కత్తి జూపెట్టి ఆడమన్షి నగలియ్యమంట, మొగాయ్నయి రూపాల్ గుంజుకుంట.... అల్లీయ్యక ఏం జేత్తరు!" తేలికగా అనేశాడు.

"ఒకవేళ వాళ్ళు అల్లరి జేస్తే!" రామారావు అడిగాడు.

"ఒంటిమీది నగలందుకొని అవుతల దుంకుతా!" తొందరగా జవాబిచ్చాడు.

రామారావు కొంచెం ఆలోచించాడు. మళ్ళీ అతని వైపు చూసి "నేను ఇప్పుడు చెప్పినట్లు ఒకవేళ ఆ నాడు నేను నా భార్యా, నా ఇద్దరు పిల్లలతో కలిసి ప్రయాణం చేస్తున్నాననుకో.... నా భార్య మీది నగలు నీవు తీసుకున్న తరువాత నన్ను చూసి నీవు నన్ను గుర్తిస్తావనుకో! అప్పుడు ఏం చేస్తావు?...."

"పొడిశేస్త దొర!...." అతను క్రిందికి చూస్తూ అన్నాడు.

రామారావు గుండె దడేల్లు మన్నది. ముఖం రంగు మారింది. గుడ్లలో నీరు తిరిగింది. కొంచెం ముందుకు వంగి....

"నా భార్య ముందు.... నా చిన్నారి పసిపాపల ముందు.... నీకు సహాయం చేసిన నన్ను.... చంపేసావా?...." రామారావు కొంచెం ఆవేశంతోనే అడిగాడు.

"మీరు నన్ను జూసినంక కోట్ల.... గవాయి పలుకుతే.... ఇగ.... నాకేం వుంటద్దొర! ఉరే అయితది. నా పెండ్లాం.. పోరగాండ్ల గతేమయిద్ది!...." మెల్లగా మట్టి గిల్లుతూ .... అన్నాడతను.

"నేను రాసిచ్చిన కాగితాలున్నాయా?.." రామారావు అడిగాడు.

"అప్పుడే పంపించిండ్రు...."

చేతిలో పుస్తకాన్ని తీసుకొని చీకట్లోకి ప్రవేశించాడు రామారావు.

"కుర్చీ తెమ్మంట్రా!...." ★

ఉచితము! ఉచితము!

## తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాతి మందు ఐదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక పీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

వివరాలు
BHARAT AYURVEDASHRAM (M)
Post Katri Sarai (Gaya)